# ఎదురీత

సూర్యుడు నిద్రలేచి, బద్ధకంగా ఆవలించాడు. ఎండ పల్చగా పడుతోంది. కూరగాయల కోటమ్మ కంఠం — కోడి కూతలాగ వినవచ్చేసరికి, వాకిటిముందు ముగ్గులు తీర్చి దిద్దుతూన్న పంచాయితీ బోర్డు ప్రసిడెంటు పరమేశ్వరయ్య భార్య లక్ష్మీకాంతమ్మ నడుమెత్తి చూసింది.

"ఏం కాంతమ్మగారూ! కూరకాయలు కావాలా?" అన్నది కోటమ్మ కూరగాయల తట్టను నెత్తిన బెట్టుకొని.

"అట్లా దించుకోవే!"

కోటమ్మ తట్టను వాకిట ప్రక్కనున్న అరుగుమీద దించుకుంది. ముగ్గుడబ్బా అరుగుమీద పెట్టి—

"వంకాయలెట్లాగే!" అన్నది లక్ష్మీకాంతమ్మ.

"సవాసేరు అణాకానీ అమ్మగారూ!"

"అణాకానియా! ఏంమే! ఇంత హెచ్చుగాఅమ్మి ఎంత సంపాదించీ ఏం చేద్దామని! మేడ కడదామనుకున్నావా!? వాడకెక్కు దామనుకున్నావా? బజార్లో ముక్కానికిస్తూంటే నువ్వు అణాకానీ చెబుతున్నావా?"

"లేదండీ; మీకు అబద్ధం చెబుతానా! తోటలో కెళ్ళి నిన్న సాయంకాలమే వేసికొచ్చాను. అణాచేసి తీసికోండి. ఒక అరవీశ తూయమంటారా?"

"ఇవాళ మా ఇంట్లో తద్దిన మనుకున్నావా, ఏమిటి పిచ్చిదానా! ఆయనగారొక్కరికే! ఒకకానీవి యివ్వు. మేమంతా పప్పూ, ఆవకాయా వేసుకుంటాము."

కోటమ్మ దిగాలుపడి చూసింది.

పావుసేరు వంకాయలు తూచే, తట్ట నెత్తిన బెట్టుకొని వెళ్ళింది గబగబా.

ఆ వూరి పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు భార్యా; ఇరవై ఎకరాల నిక్షేపమైన మాగాణీ భూమిగల ఆసామి యింటి ఇల్లాలూ, ఆ గ్రామంలో అరచేతి మందాన పరువు ప్రతిష్టలుగల పరమేశ్వరయ్యగారి అర్ధాంగీ, పెద్ద యింటి ఆడ బడుచూ, ఠీవిలో, గౌరవంలో, బ్రతుకు తీరులో - వంశపు జీవిత ప్రమాణాన్ని పెంపొందించాల్సిన బాధ్యతగల ఆమె - కానీ బెట్టి పావుసేరు కూరగాయలు కొనడంలో, కూరగాయల కోటమ్మకెంత ఆశ్చర్యాన్ని కలిగించినా లక్ష్మీకాంతమ్మ మటుకు తన పొదుపుతనానికి ఎంతో గర్వపడ్డది మనస్సులో.

ఇటా తను దిన దినమూ కుటుంబ ఖర్చు తగ్గించుకో

కుంటే – డబ్బు ఎట్లా నిల్వవుంటుంది; అయిదుగురు పిల్లల్ని పెంచి, పెద్దవాళ్ళనుచేసి – పెళ్ళిళ్ళుచేసి, వాళ్ళకు బ్రతుకు బాటను చూపించాల్సిన బాధ్యత తమమీద ఉంది; ఆయనగారేమో కుటుంబసంగతులు అసలే పట్టించుకోరు. ఎంత సేపటికీ, ఊరూ. ఊరికి ఉపకారమూ, పదవులూ, ఒ స్త్రీలకు నూటి మాటికీ వెళ్ళటమూ — అదీ ఆయనగారి పద్ధతి. ఎటొచ్చీ ఇంటియిల్లాలు గనుక – ఇంట్లో ఖర్చు తగ్గించాల్సిన బాధ్యత తనది. తనూ చాలమటుకు ఇంటిఖర్చు తగ్గిస్తూనే, పాడిమీద ఎంతో వెనుక వేస్తూన్నది కూడా! ఆయనగారే ఖర్చు తగ్గించుకోవడం లేదు. ఎవరెట్లాబోతే తనకేమో! ఊళ్ళో వాళ్ళ బాగోగుల్ని తన డబ్బు ఖర్చుతో చూడాల్సిన అగత్యం ఆయనకేముంది? స్వంత డబ్బుతో ఎన్నాళ్ళు వేస్తారాయన దేశసేవ చేసే వాళ్ళంతా లోకంలో స్వంతడబ్బును పాడుచేసుకుంటారా? ఆయనకాపాటి జ్ఞానం ఎట్లా లేకపోతూన్నది? తను అదేగుని నోరు తెరచి అడిగితే – తోక త్రొక్కిన త్రాచుపాములాగ లేస్తాడు! 'వంకాయ పులుసు వండడం కాదు; ఇవి రాజకీయాలు' అంటారు. ఏం రాజకీయాలో ఏమిటో – కొంప గుల్ల కావటానికొచ్చాయి. ఎవరి మాటా వినరాయె! అన్నయ్య పనిగట్టుకొని వొచ్చి – ఎన్నిసార్లు చెప్పాడు దుబారాఖర్చు చేయవద్దని. 'గుడ్డు వొచ్చి పిల్లనెక్కిరించిందట' అని అతనిమాటల్ని తోసివేశాడు. ఏమిటో —ఎప్పటికైనా తెలిసికోకపోతారా! తన బాధ్యతను తను సక్రమంగా నిర్వహిస్తే సరి.

బియ్యం పరిశుభ్రంగా కడిగి, ఎసట్లో వేస్తూ అనుకుంది

లక్ష్మీకాంతమ్మ. ఆమె నిత్యమూ పాఠాలుగా మననం చేసికుంటుంది కుటుంబస్థితిగతులు, ప్రత్యేకం ఆయనగారిదుబారా వ్యవహారాలు.

సంపాదించాలనే స్థిర సంకల్పం యేర్పడాలేగానీ అది ఏర్పడ్డాక - ఆవ్యక్తికి ఎంత ఆత్మాభిమానాన్ని చంపుకోవాల్సి వస్తుందో. ఎంతమంది బెదరింపులకూ, చీత్కారాలకూ గురి కావాల్సి వస్తుందో. ఎన్ని అసూయపు మాటలు భరించాల్సి వస్తుందో, లేని దారిద్ర్యాన్ని ఎంతగా సృష్టించుకోవాల్సిన అగత్యమేర్పడుతుందో - లక్ష్మీకాంతమ్మ తన బ్రతుకునూ, సహనాన్నీ, అభిమానాన్నీ, రోషాన్నీ, హృదయాన్నీ ఆ యాపరిస్థితుల కనుగుణంగా మార్చుకోవటంలో కృత్యులైంది. నిత్యమూ ఆ ఊరి బ్రాహ్మణులకు పాలూ, పెరుగూ వెన్నపూస అమ్మటంలో ఆమె మనస్సు కించెత్తు వెనుకంజ వేయలేదు. దొడ్లో కాసిన కూరగాయలూ, అరటిగెలలూ కమతగాడిచేత బజార్లో అమ్మించడంలో ఆమెవీసమెత్తు పరువు జారిపోయినట్టు బాధపడలేదు; కోడిగుడ్డు అణాన్నర చేసి కావల్సినవాళ్లు వాళ్ళ యింటికొచ్చి కొనుక్కుపోవడంలో ఆమె కించమెత్తు నామూషీపడలేదు; వేపుడు కూరలకూ, చారడేసి నేతీ భోజనానికీ, పిండివంటలకూ, ఆటవస్తులకూ ఆమె సంతానం ముఖం వాచినా - ఆమె హృదయానికి చీమకుట్టినట్టుగా లేదు. పైపెచ్చు యీ చేష్టలవల్ల, పొదుపరితనంతో - తాను ఎంతగానో డబ్బు వెనకవేస్తూందనే సంతృప్తి పైనీ, గర్వాన్ని ఆమె ఆత్మ గురికాసాగింది. ఈ విషయాలన్నీ నిజానికి పరమే

శ్వరయ్యకు తెలియవనే చెప్పొచ్చు; తెలిసినా పట్టించుకోడనే భావించవచ్చు.

ఏడువందల యాభై గడపగల ఆ వూరికి పంచాయితీ బోర్డు ప్రెసిడెంటు కావటానికి. మాట వరసకు – పరమేశ్వరయ్యకు యేడువేల అయిదు వందలకు తక్కువ కాలేదని చెప్పొచ్చు. అసలు ఆయనగారు ప్రెసిడెంటుగా నిలబడే ముందే — అట్లాంటిఖర్చు యేదో అవుతుందనే లక్ష్మీకాంతమ్మ 'మీరు నిలబడరాదు. ఈ పరువూ, పదవులూ మనకు పనికిరావు. అని కాళ్ళను కావిలించుకుందిగానీ, పరమేశ్వరయ్య పెడచెవిని పెట్టాడు. తర్వాత అయిన కర్చుకు ఆమె గుండె బాదుకొని, కడివెడు కన్నీళ్ళు కార్చిందిగానీ — ఏం లాభం? భర్తయెదుట నోరు తెరచి ఏమీ అనలేదు.

పరమేశ్వరయ్యది పదిహేను యేకరాల మాగాణీ. మూడెకరాల నిమ్మతోటా, రెండెకరాల అరటితోటా, తెనాలి తాలూకా పొలంకావడంచాత ఆ పదిహేనెకరాలకూ దాదాపు మూడువందల యాభై బస్తాల వడ్లూ, నిమ్మతోట, అరటితోటలమీద కొన్ని వేల రూపాయలఆదాయమూ ఏటా వస్తాయి. కాని ఎంతఆదాయమువొచ్చినా పంచాయితీ బోర్డు ప్రెసిడెంటుగా వొచ్చిన మరునటి సంవత్సరమే ఎకరంఅయిదు వేల ఆరువందలుచేసి మూడెకరాల మాగాణీ అమ్మివేశాడు. వారంరోజుల అన్న పానీయాలు లేకుండా లక్ష్మీకాంతమ్మ ఏడ్చింది.

పరమేశ్వరయ్య పంచాయితీబోర్డు ప్రెసిడెంటుగా రావడంవల్ల ఆ ఊరికెంతో ఉపకారం జరిగింది. రోడన్నీ మెటల్

రోడ్లుగా మార్చబడ్డాయి. ఊళ్ళో శివాలయం దగ్గరా, హైస్కూలు దగ్గరగా, మాదిగపల్లెలో రేడియోలు పెట్ట బడ్డాయి; ఊరికి యెలట్రిక్‌సిటీ త్వరలో వొచ్చే యేర్పాట్లు చేయబడ్డా; వీథులు పరిశుభ్రం చేసేందుకు మనుషులు ప్రత్యే కంగా నియమించబడ్డారు; బోర్డు తరపున గ్రంథాలయ మొకటి స్థాపించబడ్డది - అలాంటివెన్నో! ఊరికి యింతగా వుపకారం జరిగినా — లక్ష్మీకాంతమ్మకు తన భర్త యిదంతా స్వంత డబ్బు తగలపెట్టి చేస్తున్నాడనే అనుమానం ప్రబలి క్షణం శాంతిలేకుండా చేయ నారంభించింది. ఆ ఊళ్ళో పరమేశ్వ రయ్యను ధర్మపరుడుగానూ, ఆదర్శ పంచాయితీబోర్డు ప్రెసి డెంటుగానూ, తెలివిగల వాడుగానూ-వొప్పుకుంటారు. కానీ, లక్ష్మీకాంతమ్మ మనస్సూ, ఆలోచనలూ, ఆశయాలూ, అభి రుచిలో — "పొదుపు" మీాద లయం అయింది.

వానాకాలపు మేఘాల్లాంటివి పల్లెటూరి రాజకీయాలు. గ్రామంలో ఏ క్షణం ఏ సంఘటన జరుగుతుందో ఆ సంఘటన ఫలితాలు గ్రామంలో ఎటాంటి పరిస్థితులను దారితీస్తాయో యెవ్వరూ వూహించలేరు. ఒకక్షణంలో ప్రొద్దుటి ఎండలాగ ప్రశాంతంగా ఉన్న పల్లెటూరు మరో క్షణంలో యెర్రని అగ్గిలాగ భీభత్సంగా వుండొచ్చు. ఒకచిన్న సంఘటన చాలు.

ఆ రోజు మధ్యాహ్నం అంకయ్యగారి వెంకయ్య మెరక చేనుకు నీళ్లు పెట్టుకోవటంలో - నాగయ్యగారి కోటయ్య

అడ్డువొస్తాడనీ, తగాదా జరుగుతుందనీ ఊళ్ళో ఎవ్వరూ తలంచలేదు. ప్రొద్దుటినుంచీ వెంకయ్య మెరకచేను పంట కాలువ ముందు 'అడ్డు' వేసి, చేనుకు నీళ్ళు పెట్టుకుంటూ – అన్నం తిని రావటానికి యింటికి వెళ్ళాడుట. ఈలోపల కోటయ్య వొచ్చి మెరకచేను పైనగల తనచేను తూము తీశాడుట — పంట కాలువకు అడ్డుకట్టవేసి. అన్నంతిని వొచ్చిన వెంకయ్య అదిచూసి ముల్లుగర్ర విరిగేట్టు పంటకాలువగట్టును కొడుతూ, "ఓడురా. ఈ ఎంగిలి కూటిపని చేసింది. ఎన్ని గుండెలురా! పంటకాల్వలో పూడ్చిపెడతాను. తూములో మడ్చిపెడతాను దొంగవెధవను!" అన్నాడు.

బాగా ఒళ్ళు చేయుని కోడెలాంటిమనిషి కోటయ్య. చేనులో కలుపు మొక్కలు పీకుతూన్న కోటయ్య — కట్టుగొయ్యని కట్టివేసివున్న కోడిదూడ త్రాడు తెంచుకొని మీదకు వురికినట్టు, వెంకయ్యమీదకు ఉరికాడు తలగుడ్డచుట్టి, మంగళగిరి ముల్లుగర్ర విసురుకుంటూ. పంటకాలువ గట్టుమీద రెండు ముళ్ళగర్రలూ ఢీకొన్నాయి.

ముల్లుకర్రలు విరిగినయ్:

వెంకయ్య మెడమీదగా ముల్లుకర్రవాత కండెలాగ కదురుకట్టింది; కోటయ్యముక్కు నెత్తురు చిమ్మింది,

"నీ శవం కళ్ళ జూస్తారా!" అన్నాడు వెంకయ్య.

కాని చివరకు వెంకయ్య వీరశూరసేనుడిలాగ నేలకొరిగాడు.

కోటయ్య పంచాయితీబోర్డు ప్రెసిడెంటు పరమేశ్వరయ్య పార్టీవాడు. వెంకయ్య పంచాయితీబోర్డు ఎదురు పార్టీకి సంబంధించిన నాసరయ్య పార్టీవాడు. పరమేశ్వరయ్య పక్షపాతం వొచ్చినట్టుగా వొణికిపోయాడు. నాసరయ్య ముక్కుపుటాలెగురవేస్తూ, బుర్రమీసాలు తిప్పుతూ — నడివీధిలో నిలబడ్డాడు.

ఆరోజు అంతకుమించి ఏం కొట్లాట జరుగలేదు. వెంకయ్యను కొట్టిన కోటయ్య మల్లన్న గుంటదగ్గర వానిలో దాక్కున్నాడు.

కాని వెంకయ్యఅన్న నాసరయ్య ఆసరాతో కోటయ్య మీద కేసుపెట్టాడు. కోటయ్య తండ్రి నాగయ్య పరమేశ్వరయ్య పాదాలమీద పడ్డాడు. పరమేశ్వరయ్య అభయ హస్తమిచ్చాడు.

వెంకయ్య పెదనాన్నకొడుకు రామకోటి — ప్రెసిడెంటు పార్టీ మెంబరు. పరమేశ్వరయ్య కోటయ్యకు అంత చేయూతనిచ్చి వెంకయ్యను ఓడించటంతో — అభిమానం దెబ్బతిని రోషం, పెచ్చు పెరిగి — ఎదురు పార్టీతో అంటే నాసరయ్య పార్టీలో కలియడంజరిగింది. అంతేకాకుండా, ఇంకో మెంబర్ను తిప్పుకొనేందుకూడా ప్రయత్నాలు జరుపుతున్నట్టు తెలిసింది ప్రెసిడెంటుకు. ఆ యిద్దరూ పోతే పరమేశ్వరయ్య పంచాయితీ బోర్డు పరిపాలన — నడి సంద్రంలోని నావే!

పరమేశ్వరయ్యకు తన చేతితో తానే తలకి కొరివి పెట్టుకున్నట్లయింది. గాలిలో దీపంలాగ అటూ ఇటూ ఊగే

ఆమెంబరుకు రెండోకంటి వాడికి తెలీకుండా అర ఎకరానికి సరిపోయే డబ్బిచ్చి – తన ప్రక్కనే వుండేట్టు చేసుకున్నాడు.

ఆరు మాసాలకు ఆ వూళ్ళో పరిస్థితులు ఒకమాదిరిగా చక్కబడ్డాయి. పరమేశ్వరయ్య పంచాయితీబోర్డు పరిపాలన చక్కగానే నడిచిపోతూంది.

కాని ఆరుమాసాలు గడిచేప్పటికి పరమేశ్వరయ్యమరో మూడెకరాల శౌరీమాగాని అమ్మివేశాడు.

భర్త తన కంట్లో తానే పొడుచుకున్నట్టుగా భావించింది లక్ష్మీకాంతమ్మ, అంతే కాకుండా రెండో వ్రేలితో తన కంట్లోనూ, పిల్లల కళ్ళలో గూడా పొడిచినట్టుగా బాధపడింది.

* * *

సూర్యుడు కరకర మంటూ ఉదయిస్తూ వుండగానే కూరగాయల కోటమ్మ కేకతో ఆ వీధి ఉలిక్కిపడింది. వాకిటి ముగ్గులు పెడుతూన్న పంచాయితీబోర్డు ప్రెసిడెంటు భార్య లక్ష్మీకాంతమ్మ – "ఒసేవ్! కోటమ్మా! అట్లా దించుకోవే!" అన్నది.

కోటమ్మ కూరగాయల తట్టను దించుకున్నది.

ముగ్గు డబ్బాను అరుగు మీద పెట్టి లక్ష్మీకాంతమ్మ బేరం చేయ నారంభించింది.

"ఎట్లాగే కాకరకాయలూ."

"సవాసేరు బేడా అర్ధణా అమ్మగారూ!"

"ఓసి సీధరా నువ్వూ బంగారంగానూ; కాకర కాయలు బేడాఅర్ధణా!! ఎన్నడైనా అమ్మావుటే యింత ధర చేసి—"

"వడ్లబస్తా యెన్నడైనా ఇరవైఏడు రూపాయలు అమ్మిందా అండీ. అనుములబస్తా యెన్నడైనా డెబ్బైరూపాయలు అమ్మాయండీ. నిమ్మకాయలు వంద యెన్నడైనా మూడురూపాయలు అమ్మాయండీ!" అన్నది కోటమ్మ రోషం తెచ్చుకుంటూ.

"బేడ చేసి యీయవే!" అన్నది మూడునిముషాల తర్వాత తేరుకొని.

"ఎన్ని తూయమంటారు?"

"ఎన్నేమున్నదే! ఒక అర్ధణావి యివ్వు. ఆయనకు పులుసువేసి మేం బచ్చలాకు పప్పుతింటాం" అన్నది లక్ష్మీకాంతమ్మ.

"కాంతమ్మగారూ! నేనొక్క సంగతి చెబుతా ఆలకిస్తారా?" అన్నది కూరగాయల కోటమ్మ.

"ఏమిటే."

"పరమేశ్వరయ్యగారు పెట్టే ఖర్చుకా యెదురులేదు. కాలువ ప్రవాహంలాంటిది ఆయనగారుకర్చు. మీరుఎంతకూరగాయలు కొనకుండా పిల్లల్ని మాడ్చినా, పాడిమీద యెంత సంపాదించినా, ఎంత పొదుపుతనం చేసినా, – మీ సంపాదనంతా ఆ ప్రవాహంలో కొట్టుకుపోయే గడ్డిపోచంటిది. ఇట్లా మీరు ఆయనగారి కర్చును అరికట్టలేరు. ఎన్నాళ్ళిట్లా ఎదురీత ఈదుతారు!"

కూరగాయల కోటమ్మ మాటలు — లక్ష్మీకాంతమ్మ హృదయాన్ని అభిమన్యుని బాణాల్లాగ తాకినై.

అవును, తను ఎదుగీత యీదుతున్నది. అవతలి ఒడ్డున్నదో, లేదో తెల్సుకోకుండా — తను ఎదురీతకు పూనుకున్నది. ఎన్నాళ్ళనుంచో ఎదురీత ఈదుతున్నది. దరీదాపూ నేను చూపు మేరలో కనిపించక పోయినా తనుగుడ్డిమెద్దు చేనులో పడ్డట్టుగా. పొదుపు తనంతో ప్రాకులాడుతూన్నది. పిల్లల్ని కడుపులు మాడుస్తున్నది. వాళ్ళ కోర్కెల్ని ఎక్కడికక్కడ పచ్చిమిరపకాయల తొడిమలను త్రుంచివేసినట్టు త్రుంచి వేస్తూన్నది, తనెందుకిట్లా యిన్ని యేళ్ళుగా తెలివి తక్కువగా ప్రవర్తించింది? గర్భ దారిద్ర్యంతో కొట్టుకులాడుతున్నట్టుగా — పిల్లల్ని ఎందుకు పెంచాల్సి వొచ్చింది? ప్రవాహ వేగంలో గడ్డిపోచ నిలుస్తుందా? అంతే! అంతే. తనపొదుపుదనం ఆయనగారి ఖర్చులో ఎన్నోవంతు? అవును. నిజం. కోటమ్మ తన కళ్ళముందున్న అజ్ఞానపు తెరను తొలగించింది.

లక్ష్మీకాంతమ్మ ముఖం ఎర్రగులాబీ పువ్వులా గైంది. ఆమె కళ్ళు నీటిమీద పడే చంద్ర కిరణాలైనాయి.

"కోటమ్మా!" అన్నది, ఆమె గొంతు కూడా. ఎంత స్వేచ్ఛనూ, సంతృప్తినీ పొందింది.

"సవాసేరు బెండకాయలూ. అరవీశె వంకాయలూ, సవాసేరు కాకరకాయలూ, అరవీశె బంగాళాదుంపలూ, తూయవే," అన్నది లక్ష్మీకాంతమ్మ. ఆమె ముఖంలో తృప్తితో కూడుకున్న భావాలు పారాడుతున్నాయి.

ఆమెలో కలిగిన పరివర్తనని కూరగాయల కోటమ్మ గ్రహించింది. ఆమె ఆ కూరగాయల్ని తూస్తూ వుండగానే లక్ష్మీకాంతమ్మ యింట్లోకి వెళ్ళి రూపాయి కాగితమూ, బుట్టా తీసుకొచ్చింది.

ఆ కూరగాయల నన్నిటినీ సక్రమంగా తూచి. కోటమ్మ బుట్టలో వేసింది.

లక్ష్మీకాంతమ్మ సగర్వంగా రూపాయి నోటును ఆమె చేతికి అందించింది. కోటమ్మ ఆ నోటును కళ్ళకు అద్దుకొని - బొడ్లో దాచుకుంది.

ఆ కూరగాయల బుట్టను చంకన పెట్టుకొని లక్ష్మీకాంతమ్మ మనసారా చిరునవ్వు నవ్వింది.

— ఆంధ్ర మహిళ